జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 27-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 711 పేజీలు: 4 వెల : రూ.7


# కలెక్షన్ కింగ్.. కానిస్టేబుల్.. శ్రీనివాస్




- సివిల్ సెటిల్‌మెంట్లు, కలెక్షన్లు చేయడంలో ఈ కానిస్టేబుల్ దిట్ట
- విధులను పక్కన పెట్టి వసూళ్లకే ప్రాధాన్యం
- స్టేషన్ బయటే రాజీలు
- అధికారులు, తోటిసిబ్బంది నిలదీస్తే ఉన్నతాధికారులకు ఆకాశరామన్న ఫిర్యాదులు
- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ తన వారు ఉన్నారని బెదిరింపులు
- ఇతనికి ఓ ఎస్‌బీ కానిస్టేబుల్ అండదండలు
- కలెక్షన్లలోనూ ఎస్‌బీ కానిస్టేబుల్‌కు వాటాలు
- కులం కార్డు ఉపయోగించడంలోనూ దిట్ట
- అధికార, ప్రతిపక్ష నేతలతోనూ సంబంధాలు
- తనను టచ్ చేస్తే.. బదిలీ అయిపోతారని బెదిరింపులు
- తనపై ఫిర్యాదులు జిల్లా బాస్ దృష్టికి వెళ్లకుండా మేనేజ్‌మెంట్
- గ్రానైట్ పరిశ్రమలు, మద్యం షాపుల నుంచి నెలవారీ మామూళ్లు
- మనోడు డ్యూటీ.. జాతీయ రహదారిపైనే
- వాహనాలు ఆపడం.. కలెక్షన్లు చేయడమే పని

పూరి జగన్నాథ్ తీసిన ఓ సినిమాలో ఓ పోలీసు అధికారి ఏవిధంగా డబ్బులు సంపాదించాలి అనేది చక్కగా చూపించారు. ఆ పోలీసు అధికారి బాటలో పయనిస్తూ లక్షలు సంపాదిస్తున్నాడు.. నందిగాం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్. చిన్న స్టేషన్ అయినప్పటికీ మనోడి కలెక్షన్లు మాత్రం గట్టిగానే ఉంటాయి. కేసు ఎలాంటిదైనా దక్కిన కాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడు. స్టేషన్‌లో కన్నా జాతీయ రహదారిపైనే ఎక్కువగా ఉంటాడు. పగలు కన్నా రాత్రివేళే ఎక్కువగా హైవేపైగా డ్యూటీ చేస్తుంటాడు. వాహనాలు ఆపడం.. కలెక్షన్లు చేయడం మనోడి రాచకార్యం. నెలవారీ మనోడి కలెక్షన్.. జీతం కన్నా మూడింతలు ఎక్కువగా వస్తుంటుంది. మనోడి మెయింటినెన్స్ చూస్తే.. తల గిర్రున తిరిగిపోతుంది. తనను టచ్ చేస్తే.. ఇక్కడి నుంచి బదిలీ అయిపోతారని భయపెడుతుండడంతో పోలీసు అధికారులు సైతం మనకెందుకులే ఇతనితో గొడవ అని వెనక్కి తగ్గుతుంటారంటే.. మనోడి హవా ఇట్టే అర్థమైపోతోంది.

**శ్రీకాకుళం క్రైం, జూన్ 26 (వార్త):** నందిగాం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పోలీసు విధులు తప్పా.. మిగతావన్నీ చేస్తుంటాడు. స్టేషన్ బయట సివిల్ సెటిల్‌మెంట్లు, దందాలు, నెలవారీ కలెక్షన్లు చేస్తుంటాడు. ఎవరైనా ఫిర్యాదు చేయడానికి వస్తే మనోడే ముందు వారిని ఎంక్వయిరీ చేస్తాడు. చట్టంలోని లూప్‌హోల్స్‌ని పట్టుకుని ఇరువర్గాలు రాజీ చేసుకునేలా పాపం.. చాలా కష్టపడతాడు. కేసు కట్టేందుకు వచ్చిన వారిని నయానో భయానో తన దారికి తెచ్చుకుంటాడు. వారి నుంచి అందినకాడికి దోచుకుంటాడు. స్టేషన్‌కు ఇంత ఇవ్వాల్సి వుంటుందని చెప్పి వారి నుంచి బాగానే కలెక్షన్ చేస్తాడు. స్టేషన్‌లోని తోటి సిబ్బంది గాని, అధికారులు గాని ఇదేంటని నిలదీస్తే.. వారిపైనే ఆకాశ రామన్న పేరిట ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తుంటాడు. ఇతనికి ఎస్‌బీ కానిస్టేబుల్ అండదండలు ఉండడంతో పేట్రేగిపోతున్నాడు. దీంతో తోటి సిబ్బంది అతనితో మనకెందుకులే అని మౌనం వహిస్తున్నారు. కులం కార్డు ఉపయోగించడంలోనూ మనోడు మహాదిట్ట. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ తన కులం ఉన్న అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటాడు. తనపై ఎవరైనా ఫిర్యాదు చేసినా.. అవి బుట్టదాఖలు అయ్యేలా చూసుకుంటాడు. వారిని సైతం మేనేజ్ చేస్తాడు. ఎప్పుడూ గుట్కా, పాన్‌పరాగ్ నములుతూ ఉంటాడు. నందిగాంలో విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకూ ఐఎస్‌డబ్ల్యూకి, బందోబస్తు డ్యూటీకి వెళ్లిన దాఖలాలు లేవంటే మనోడు ఏవిధంగా మేనేజ్ చేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. అధికార, ప్రతిపక్ష నాయకులను కలుపుకోవడంలోనూ మంచి దిట్ట.

## శ్రీనివాసుడి.. కలెక్షన్ల పర్వం ఇదీ..

నందిగాం మండలంలోని ఒక ట్రాక్టర్ బైక్‌ను ఢీ కొన్న ఘటనలో ద్విచక్రవాహనచోదకుడికి గాయాలయ్యాయి. ఈ కేసులో మనోడు ట్రాక్టర్ యజమానికి నుంచి రూ.30వేలు కలెక్షన్ చేశాడు. నందిగాం మండలంలో నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. ప్రతి నెలా రూ.7 నుంచి రూ.8 వేలు చొప్పున ఒక్కో షాపు నుంచి గుంజుతాడు. ఒక్కో బెల్టుషాపునకు వెళ్లి వారి నుంచి నెలకు రూ.500లు చొప్పున వసూలు చేస్తున్నాడు. జాతీయ రహదారిపై పశువులను తరలిస్తున్న వ్యాన్ (ఏపీ39యుఆర్‌ఎస్5281)ను టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకుని నందిగాం స్టేషన్‌కు అప్పగించారు. అయితే విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఆ పశువుల వ్యాపారిని భయపెట్టి రూ.30వేలు వసూలు చేశాడు. 41కు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు గాను మనోడు రూ.40వేలు చొప్పున కలెక్షన్ చేస్తున్నాడు. అమ్మవారి పండగల్లో పిక్కాట ఆడించేందుకు గాను ఆయా గ్రామాల్లో నిర్వాహకుల నుంచి డబ్బులు లాగేస్తుంటాడు. ఇటీవల మాదిగాపురంలో జరిగిన అమ్మవారి పండగలో పిక్కాట నిర్వాహకుల నుంచి రూ.15వేలు, తురకపాలెం గ్రామంలో రూ.20వేలు వసూలు చేశాడని గ్రామస్థులే చెబుతున్నారు. క్రైం నెంబరు 13/2026 కేసుకు సంబంధించి గోల్డ్ సెటిల్‌మెంట్ పేరిట మహాలక్ష్మి అనే వృద్ధురాలి నుంచి ఏకంగా రూ.55వేలును శ్రీనివాస్ గుంజేశాడు. నందిగాం మండలంలో ఓ గ్రానైట్ క్వారీల నుంచి ప్రతినెలా రూ.60వేలు వరకూ ఈ శ్రీనివాసులు కలెక్షన్ చేస్తున్నాడు.

**( పోలీస్.. శ్రీనివాసుడి అక్రమ వసూళ్లు, అతనికి అండగా ఉన్న ఎస్‌బీ కానిస్టేబుల్ పారినాయుడు లీలలపై త్వరలో 'జాతీయ వార్త'లో మరో కథనం)**

# తొమ్మిది కిలోల గంజాయితో.. మహారాష్ట్ర వ్యక్తి అరెస్టు

- ఒడిశాకు చెందిన మైనర్ కూడా..
- రెండు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ, ఎస్ఐ

మందస, జూన్ 26(వార్త): ఎన్నడూలేని విధంగా గంజాయి వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. మందస ఎస్ఐగా కూటికుప్పల కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరించాక గంజాయి వ్యాపారంపై నిఘా పెట్టి గుట్టురట్టు చేస్తున్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు చాకచక్యంగా పట్టుకుంటున్నారు. మందస మండలంలోని కొర్రాయిగేటు జంక్షన్ సమీపంలో గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఇద్దరు వ్యక్తులను పోలీసులు గంజాయితో అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మైనర్ బాలుడు ఉండడం విశేషం. ఈ కేసుకు సంబంధించి ఏ1గా మహారాష్ట్రకు చెందిన శ్రీరాం, ఏ2గా ఒడిశాకు చెందిన రంజన్, ఏ3గా బావాజీ బాంపటేల్ పై పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీరాం కుటుంబంతో సహా మహారాష్ట్రలో పూణే జిలేబి షాప్ పెట్టుకొని వ్యాపారం చేస్తుంటాడు. ఒరిస్సాకు చెందిన రంజాన్ అనే వ్యక్తితో పరిచయం అయ్యాడు. తరువాత అతని ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో రంజాన్ గంజాయి ఇస్తాను.. అది ఎక్కువ ధరకు అమ్ముకొని డబ్బులు సంపాదించు అని చెప్పాడు. ఆయన భయంతో తరువాత చెపుతానని చెప్పాడు. అతని జిలేబి వ్యాపారం సరిగా లేకపోవడంతో విశాఖపట్నం, విజయనగరంలలో జిలేబి వ్యాపారం చేయాలని భావించి షాప్ పెట్టడం కోసం విశాఖపట్నంలో చూడగా ఎక్కడా అనువుగా లేకపోవడంతో 2026 ఫిబ్రవరి 20న ట్రైన్‌లో విజయనగరం వచ్చి అక్కడ ఏపీ35ఏఎల్6533 నెంబర్ గల ఒక స్కూటీని దొంగతనం చేసి, అదే స్కూటీపై హైవే మీదుగా బరంపురం చేరుకున్నాడు. తరువాత కొన్ని రోజులకు స్కూటీని బరంపురం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చేసి పూణే వెళ్ళిపోయాడు. వేరొక స్నేహితుని ద్వారా బావాజీబాంపటేల్ పరిచయం అయి అతనికి గంజాయిని అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు., శ్రీరాంకు ఫోన్ పే లేనందున తన వద్ద పూణే లో పనిచేస్తున్న ఒక మైనర్ అబ్బాయికు డబ్బు ఇస్తాను అని ఆశ చూపి ఆ మైనర్ అబ్బాయి ఫోన్ పే కు నాలుగు దపాలుగా రూ.75,000లు చొప్పున బావాజీబాంపటేల్ తన ఫోన్ పే ద్వారా పంపడం జరిగినది. రంజాన్ తే.17.06.2026 దిన పుల్బాని గ్రామానికి కొంత దూరం ముందుకు రమ్మని శ్రీరాంతో పాటు మైనర్ అబ్బాయిలకు చెప్పి, ఎనిమిది ప్యాకెట్లు గంజాయి ఇచ్చి శ్రీరాం వద్ద నుండి నగదు రూపంలో రూ.26,000లు తీసుకొని వెళ్ళిపోయాడు. ఆ గంజాయి తీసుకుని వారు ఈ నెల 25న ఉదయం బరంపురంలో స్కూటీపై పలాస రైల్వే స్టేషన్‌లో పూణే వెళ్లేందుకు ట్రైన్ ఎక్కి, వెళ్ళడానికి పలాస వెళ్లేందుకు హైవే పై వస్తుండగా శ్రీరాం, ఒక మైనర్ అబ్బాయి పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్టు కాశీబుగ్గ రూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు.



జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# జన సైనికునికి ఆర్థికసాయం



**ఇచ్ఛాపురం, జూన్ 26 (వార్త):** కవిటి మండలం కమలాయి పుట్టుగ గ్రామానికి చెందిన పిల్లి దేవ అనే జనసైనికుడికి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ జనసేన పార్టీ నాయ కులు దాసరి రాజు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దుంగ భాస్కర్‌రెడ్డి, గంగులు, కాళిదాసు, ధనుంజయ, శ్యామ్‌కుమార్, లక్ష్మణరావు, సాగర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్‌పై టీడీపీ సమీక్ష



**పలాస, జూన్ 26(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్లను సమావేశానికి ఆహ్వానించి, ఇప్పటివరకు సర్ కార్యక్రమం ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లింది, ఎంతమేరకు దరఖాస్తులు వచ్చాయో నాయకులు సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా పార్లమెంటరీ వైస్ ప్రెసిడెంట్, క్లస్టర్-1 కన్వీనర్ గాలి కృష్ణారావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, ప్రధాన కార్యదర్శి సప్ప నవీన్, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి బూత్ స్థాయిలో సమన్వయంతో పని చేయాలని నేతలు సూచించారు. చిన్న సమన్వయ లోపాలు ఉన్నా వాటిని పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలని, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో దరఖాస్తుల సేకరణను వేగవంతం చేయడంతో పాటు, ప్రతి ఏజెంట్ తన పరిదిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# జీవితాలను చిత్తుచేసే డ్రగ్స్ జోలికెళ్లొద్దు




**సోంపేట, జూన్ 26(వార్త):** జీవితాలను చిత్తుచేసే డ్రగ్స్ జోలికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని సోంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన సోంపేటలో ఎస్ఐ మోహిని, అగ్నిమాపక ఎస్ఐ సూర్యారావుతో కలిసి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు మీదుగా సాగిన ఈ అవగాహన ర్యాలీలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సోంపేట, ఎమ్మెస్ పల్లి మోడల్ పాఠశాలల వద్ద విద్యార్థులకు మరింత అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో మంచి విద్యాభ్యాసం కొనసాగించి ఉత్తమ విద్యార్థులుగా, అత్యుత్తమ భవిష్యత్‌కు కృషి చేయాలని కోరారు. ఈ దశలో మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా దృఢ సంకల్పంతో చదువులు కొనసాగించాలన్నారు. అనంతరం ఉద్యోగాల్లో స్థిరపడి మంచి భవిష్యత్‌తో మరింతగా రాణించాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. మత్తు పదార్థాలు కలిగి ఉండడం, వాటిని సేవించడం, రవాణా చేయడం మొదలైన కారణాలతో పట్టుబడితే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తద్వారా బంగారు జీవితం చీకటిమయం అవుతుందని అన్నారు.



## విద్యార్థులకు పోటీలు

విద్యార్థులకు మారకద్రవ్యాలపై అవగాహన నిమిత్తం సోంపేట, కంచిలి మోడల్ పాఠశాలల్లో వక్తృత్వ పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, భానుప్రసాద్, మార్కారావు, ఉమాపతి, గుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలందించలేని దుస్థితిలో ప్రభుత్వం



**ఇచ్ఛాపురం, జూన్ 26 (వార్త):** రైతుకు విత్తనాలు కూడా అందించలేని కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆశి కృష్ణారెడ్డి, వైసీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలైనా గానీ రైతులకు అవసరమైన వరి విత్తనాలు సరఫరా చేయలేని ప్రభుత్వం సిగ్గుపడాలని ఎద్దేవా చేశారు. ప్రైవేటు విత్తన కేంద్రాల్లో విత్తనాలు కొనేటప్పుడు విత్తనాల రసీదులు, విత్తనాలు వేసిన తరువాత ఖాళీ సంచులు భద్రపరుచుకోవాలని, రైతు నష్టపోవాల్సి వస్తుందని ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు సూచించారు. గత అనుభవాల దృష్ట్యా రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని తెలిపారు. ప్రైవేట్ కంపెనీ నాసిరకం విత్తనాలు సరఫరా చేసి, ఆ విత్తనాలు మొలకెత్తకపోతే రైతుకు జరిగే నష్టం నాసిరకం విత్తనాలు సరఫరా చేసే కంపెనీపై ఫిర్యాదు చేసి రైతుకు జరిగే నష్టానికి పరిహారం చెల్లింపునకు క్లెయిమ్ చేయడానికి కొనుగోలు రసీదులు అవసరం అన్నారు. రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయలేని ప్రభుత్వం అనివార్యంగా ప్రైవేట్ వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి, నాసిరకం లేదా కల్తీ విత్తనాలు అమ్మకం చేసినా కంపెనీల నుంచి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు అప్రమత్తంగా లేకపోతే లేదంటే ఇటు ప్రభుత్వం అటు విత్తన కంపెనీలు తప్పించుకునే ప్రమాదం ఉందని ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అని గుర్తు చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో రైతులకు స్వర్ణయుగం అని గుర్తుచేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు ఇంటికే పంపేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు డబ్బులు ఇచ్చి కొందామన్నా దొరికే పరిస్థితి లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలో విత్తనాలు ఎరువులు అందిచలేకపోవడం ఆ శాఖ వైఫల్యం కిందకే వస్తుందన్నారు. ఇకనైనా పాలక ప్రభుత్వం మేల్కొకపోతే రైతులు అనేవారు వ్యవసాయం చేసేవారు అని చెప్పుకోవాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నీలాపు జగదీష్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి ఇసురు పరశురామ్ రెడ్డి, ఆసి పురుషోత్తం రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్య రెడ్డి, మాజీ కారింగి త్రినాథ్, బాకి లక్ష్మి నారాయణ, రెడ్డి కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పలాస జిల్లా ఎప్పుడు?

- -100 రోజుల హామీ ఏమైంది
- - 'హామీలు కాదు, పరిష్కారాలు కావాలి
- - మాట తప్పితే మౌనం వీడతాం
- - పలాస గోడు వినదా ప్రభుత్వం

**- శ్రీధర్ అల్టిమేటం**



**పలాస, జూన్ 26(వార్త):** పలాస నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కీలక సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆకాంక్షలు, హక్కులు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఏడు డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన సమయంలో పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని చెప్పి చివరి క్షణంలో నిర్ణయం మార్చారని, ఉద్దానం, ఇచ్ఛాపురం, సోంపేట, మందస ప్రాంతాలకు అందుబాటులో ఉండే పలాసకు జిల్లా హోదా ఇవ్వడం తో కిడ్నీ బాధితులకు, మత్స్యకారులకు పాలనాపరంగా మేలు జరుగుతుందని, ప్రజల మనోభావాలను గౌరవించి తక్షణమే జిల్లాగా ప్రకటించాలని కోరారు. నియోజకవర్గంలోని వైన్ షాపులు, బెల్ట్ షాపుల్లో ఎంఆర్‌పీ కంటే రూ.10 నుంచి రూ.50 వరకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, దీంతో కూలీలు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తనిఖీలు నిర్వహించి లైసెన్సులు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకార యువకుడు మువ్వల నగేశ్ అనుమానాస్పద మృతి కేసులో 2024 యువగళం సభలో 100 రోజుల్లో న్యాయం చేస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదని, స్థానిక పోలీసుల దర్యాప్తుపై బాధిత కుటుంబానికి నమ్మకం లేదని, ఈ కేసును సీబీఐకి అప్పగించి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వేలాది కుటుంబాలకు జీవనాధారమైన జీడి పరిశ్రమపై విధించిన డబుల్ ఆన్‌లైన్ ఈ-పర్మిట్ విధానం వల్ల రైతులు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, పర్మిట్ కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఈ కొత్త సర్క్యులర్‌ను ఉపసంహరించుకుని పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పలాస మున్సిపాలిటీలో ప్రతి సంవత్సరం ఆటోమేటిక్‌గా 15 శాతం ఇంటి పన్ను పెరుగుతోందని, దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోందని, ఈ విధానాన్ని రద్దు చేసి 2021కి ముందున్న పన్ను రేట్లు పునరుద్ధరించాలని కోరారు.

రాష్ట్రంలో బీసీ-ఏ గ్రూపులో ఉన్న కేవిటి కులానికి కేంద్ర ఓబీసీ జాబితాలో స్థానం లేకపోవడంతో విద్య, ఉద్యోగాల్లో యువత నష్టపోతోందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు పంపి కుల ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, చెరువులు, దేవాదాయ భూములను రాజకీయ నాయకులు, రియల్టర్లు ఆక్రమిస్తున్నారని, సమగ్ర సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించి కంచెలు ఏర్పాటు చేయాలని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాశ్వత రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, లేని పక్షంలో న్యాయపరంగా, ప్రజా ఉద్యమాల ద్వారా పోరాడతామని దువ్వాడ శ్రీధర్ బాబా తన ప్రకటనలో తెలిపారు.

# జనసేన సాధక ప్రతినిధి సభ్యుల నియామకం









**ఇచ్ఛాపురం, జూన్ 26(వార్త):** జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలనే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన శ్రీకాకుళం పార్లమెంట్ జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి సాదక్ ప్రతినిధి సభ్యులుగా దుంగు భాస్కర్ రెడ్డి, అబ్జర్వర్ సభ్యులుగా బాసి భారతీ రెడ్డి, అంగ సురేష్ కుమార్, తిప్పన సురేష్ రెడ్డిని నియమించారని నియోజకవర్గ జనసేన నాయకులు దాసరి రాజు తెలిపారు. ఈ మహత్తరమైన బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు నిర్దేశించిన ఆదేశాలు, సూచనలు, మార్గదర్శకాలు, నిబంధనలకనుగుణంగా సంపూర్ణ నిబద్ధతతో, అంతఃకరణ శుద్ధితో, త్రికరణ శుద్ధితో సమాచార సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి తమవంతు సేవలను అంకితం చేస్తామన్నారు. ఈ బాధ్యతను పదవిగా కాకుండా, పార్టీ మనపై ఉంచిన విశ్వాసంగా భావిస్తూ, శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో పార్టీ నిర్మాణానికి, సమర్థవంతమైన నాయకత్వాన్ని గుర్తించేందుకు, జనసేన ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు.



## సోమేష్‌ను పరామర్శించిన..
# వైసీపీ నాయకులు

**సంతబొమ్మాళి, జూన్ 26(వార్త):** సంతబొమ్మాళి ఎంపీటీసీ ప్రతినిధి శిమ్మ సోమేశ్ ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో వైసీపీ మండల నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఆయనే ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని రాష్ట్ర వైయస్ఆర్ సీపీ జాయింట్ సెక్రటరీ కెల్లి జగన్నాయకులు (గోవింద్) మనోధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ఎంపీపీ ప్రతినిధి మేరుగు అప్పారావు, దండు గోపాలపురం సర్పంచ్ ప్రతినిధి మార్పు నాగభూషణ, పాలతలగం ఎంపీటీసీ ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, మండల ఆర్.టీ.ఐ అధ్యక్షుడు ముద్దపు ఆనందరావు, కళింగపట్నం నాగరాజు, చమళ్ల రమణ, రేయ్యి ఆనంద్ పాల్గొన్నారు.

# దుర్గాదేవి తృతీయ జాతర ప్రారంభం





**జి.సిగడాం, జూన్ 26(వార్త):** పెంట గ్రామంలో వెలిసిన దుర్గాదేవి అమ్మ వారి తృతీయ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి. ఈ జాతరలో భాగంగా శని వారం హోమం, ఆదివారం అమ్మవారికి మొక్కుబడులు చెల్లింపులు నిర్వహించ నున్నారు. మహా అన్నదాన కార్యక్ర మం, సాయంత్రం 5గంటలకు మంగళ వాయిద్యాలు, శక్తి వేషాలతో గ్రామ పురవీధుల్లో అమ్మవారి తిరువీధి కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు అలయ కమిటీ, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ మూడు రోజులు అంగరంగ వైభవంగా జాతర మహోత్సవం జరుగుతుందన్నా రు. మొదట రోజు భక్తులు అమ్మవారి విగ్రహాన్ని ముగ్గురాటలతో శుద్ధి చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజ లు నిర్వహించారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## ఓటర్ల నమోదుకు శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్

**- కమిషనర్ హనుమంతు కూర్మారావు**

**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 27 (శనివారం), 28 (ఆదివారం) తేదీల్లో ఓటర్ల నమోదు, సవరణల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ హనుమంతు కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా కొత్తగా ఓటు హక్కు కోసం ఫారం-6, పేరు, వయస్సు, చిరునామా మార్పుల వంటి సవరణల కోసం ఫారం-8, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు కోసం ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ వివరించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారు వయస్సు, నివాస ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారు 'ఓటర్ హెల్ప్‌లైన్' యాప్ లేదా జాతీయ ఓటర్ల సేవా పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఈ సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ హనుమంతు కూర్మారావు విజ్ఞప్తి చేశారు.

# మార్చి నాటికి భూసమస్యల పరిష్కారం

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**-దంత, కస్తూరి పాడు రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి**



**కోటబొమ్మాళి, జూన్ 26(వార్త):** భూయజమానుల సమగ్ర భూ సమస్యలు వచ్చే ఏడాది మార్చి నాటికి శాశ్వత పరిష్కారం చూపాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గంలో కోటబొమ్మాళి తాసీల్దార్ కార్యాలయంలో దంత, కస్తూరి పాడు పంచాయతీ రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను శుక్రవారం మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామాల్లో దశల వారీగా సమగ్ర రీ సర్వే నిర్వహించి రైతుల ప్రధాన సమస్య అయిన భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి ఫోటో ముద్రించి పాసుపుస్తకాలు జారీచేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, వాటి స్థానంలో వారసత్వంగా సంక్రమించిన భూమిని యజమానులకు అధికారిక రాజముద్ర ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రీ-సర్వేలోని లోపాలను సరిదిద్ది, భూ యజమానులకు పూర్తి భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. గత ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి వివాదాలు లేని స్థలాలను కూడా అసంబద్ధ రీ-సర్వేతో వివాదాస్పదం చేశారని, అటువంటి సమస్యలన్నింటినీ పరిష్కరించి రైతులకు క్లీన్ టైటిల్స్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వే పూర్తి చేసి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే పరిష్కరించి శాశ్వత రెవెన్యూ భూసమస్యలు లేని విధంగా చర్యలు చేపడతామని అన్నారు. జిల్లా మండల స్థాయిలో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టం ( పి జి ఆర్ ఎస్) విభాగానికి అధికంగా భూ సమస్యలు రావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతినెల 9వ తేదీన స్వయంగా భూ యజమానులతో మాట్లాడి భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూ యజమానులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి మాజీ సైనికుల విరాళం



**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** కంపోస్ట్ కాలనీలోని ఓ అనాథ వృద్ధురాలికి నీడ కల్పించడానికి శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు సమక్షంలో రూ. 21,000ల విరాళం అందజేశామని జిల్లా ఎక్స్ సర్వీస్‌మన్ ఫెడరేషన్ అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. మాజీ సైనికుడు నర్సింగ్ ద్వారా ఆ బామ్మ దీన స్థితిని తెలుసుకుని, తమ మాజీ సైనికులందరం ఈ మొత్తాని సమకూర్చామన్నారు. ఈ సామాజిక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం ఆ సంఘం జనరల్ సెక్రటరీ పైడి మురళీధర రావు, కోశాధికారి ముదిల సింహాచలం, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సనపల రామకృష్ణ, హానరరీ ప్రెసిడెంట్ సవర లక్ష్మణరావు, అడ్వైజర్ పైడి రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ బోర రాంబాబు, బట్న కామేశ్వర రావు, సిక్కోలు సైనికుడు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయం

**- డీఎస్పీ వివేకానంద**




**శ్రీకాకుళం, జూన్ 26(వార్త):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీని శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సీహెచ్. వివేకానంద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. అనంతరం డే అండ్ నైట్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం - మాదకద్రవ్యాల రహిత జిల్లా లక్ష్య సాధన కోసం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గంజాయి, మత్తు మాత్రలు, ఇతర మాదక పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన "సంకల్పం- అభ్యుదయ సైకిల్ యాత్ర" విశేష స్పందన పొందిందన్నారు. ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ యాత్రలో సుమారు 50 వేల మందికి పైగా ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి తమ మద్దతు తెలియజేశారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజలు, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్-1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపడుతూ, అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని డీఎస్పీ వెల్లడించారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి - జీవితానికి అవును చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండేడెంట్ సీహెచ్. రామచంద్ర కుమార్, సీఐలు ఈశ్వరరావు, రామారావు, పోలీసు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

**- మంత్రి అచ్చెన్నాయుడు**

**- 23 యూనిట్ల మోపెడ్ వాహనాల పంపిణీ**



**కోటబొమ్మాళి, జూన్ 26(వార్త):** ప్రభుత్వం గిరిజనుల ఆర్థిక అభివృద్ధి సాధించేలా అన్ని విధాల తోడ్పాటును అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాలి లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గిరిజనుల మత్స్యకారులకు రెండు చక్రాల మోపెడు వాహనాలను(ఐస్ బాక్సులతో సహా) మంత్రి.. లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, సామాజిక ఆర్థిక అంతరాలను పూడ్చడానికి గిరిజల్లకు ప్రత్యేక కేంద్ర సహాయ ఉప పథకాన్ని ప్రభుత్వ అమలు చేస్తుందన్నారు. గిరిజన మత్స్యకారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తుందన్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 16 సబ్ ప్లాన్ మండలాల్లో భాగంగా జిల్లాలోని 69 యూనిట్లు రెండు చక్రాల మోపెడు వాహనాలను(ఐస్ బాక్సులతో సహా) గిరిజన మత్స్యకారులకు అందిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు ప్రత్యేక కేంద్ర సహాయ ఉప పథకం కింద ఒక్కో యూనిట్ విలువ లక్ష 14 వేల వంద రూపాయలు కాగా 75 శాతం రాయితీపై రూ.85,575 అందివ్వనున్నామని, లబ్ధిదారుల కంట్రిబ్యూషన్ 25 శాతం రూ.28,525 చెల్లించవలసి ఉంటుందని వివరించారు. టెక్కలి నియోజకవర్గంలో 23 యూనిట్ల మంజూరు కాగా నందిగామ మండలం -13, సంతబొమ్మాలి మండలం-03, టెక్కలి -07 మంది గిరిజన మత్స్యకార లబ్ధిదారులకు రెండు చక్రాల మోపెడు వాహనాలను(ఐస్ బాక్సులతో సహా)పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎమ్ .కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, మత్స్యశాఖ ఉపసంచాలకులు టి.సుమలత, సహాయ సంచాలకులు డి.గోపీకృష్ణ, టెక్కలి మత్స్య కార అభివృద్ధి అధికారి ధర్మరాజ్ పాత్రో, స్వర్ణ గ్రామ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి వెన్నెముక : బగ్గు



**పోలాకి, జూన్ 26(వార్త):** కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల పాత్రను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమర్థంగా సిద్ధం కావడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ...పార్టీ విజయానికి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి కమిటీలను మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయడం ద్వారా విజయాన్ని సాధించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, యం.వెంకటప్పల నాయుడు , వెలమల రాజేంద్ర నాయుడు , కత్తిరి వెంకటరమణ , క్లస్టర్ ఇంచార్జ్ శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, సూరపు నారాయణదాసు, కరుకోల రమేష్‌బాబు, భైరి భాస్కరరావు, సురవరపు తిరుపతిరావు, దుంగ స్వామి బాబు, తర్ర బలరాం, రావాడ కృష్ణారావు, బగ్గు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క బాధితులకు మెరుగైన వైద్య సహాయం



**కోటబొమ్మాళి, జూన్ 26(వార్త):** టెక్కలి పట్టణంలో వీధికుక్క దాడి చేసి పాతిక మందిని గాయపరిచిన ఘటనపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అత్యంత వేగంగా స్పందించారు. విషయం తెలిసిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా నేరుగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీఓ కృష్ణమూర్తిలతో ఫోన్లో ప్రత్యేకంగా మాట్లాడి యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. బాధితులందరికీ ప్రభుత్వం తరపున పూర్తి ఉచితంగా, అత్యంత మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని, ఆసుపత్రిలో యాంటీ-రేబీస్ వ్యాక్సిన్లు, అవసరమైన మందులను తక్షణమే అందుబాటులో ఉంచాలని అధికారులను స్వయంగా పురమాయించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించి, తానే స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో నియోజకవర్గంలో వీధి కుక్కల బెడదపై మంత్రి అచ్చెన్నాయుడు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్, పంచాయతీ, పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో తక్షణమే రంగంలోకి దిగి కుక్కల నియంత్రణకు, వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాల రక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, బాధితుల కుటుంబాలకు తాను అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, తక్షణమే క్షేత్రస్థాయిలో చర్యలు ప్రారంభం కావాలని మంత్రి గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి




**పలాస, జూన్ 26(వార్త):** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నశా ముక్త భారత్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ పోలీసులు మాజీ సైనికులు, కళాశాల విద్యా ర్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జ్ జంక్షన్ నుంచి పలాస ఇందిరా చౌక్ వరకు సాగిన ఈ ర్యాలీలో పోలీసులు, మాజీ సైనికులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు వ్యతిరే కంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువతే వెన్నుముకని, అలాంటి యువత మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితా లను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయన్నారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మాజీ సైనికులు,పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి జీవితంలో ఎప్పటికీ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, మత్తు పదార్థాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కొరికాన శంకరరావు, లొడగల కామేష్, కాశీబుగ్గ ఎస్ఐలు ఆర్.నరసింహమూర్తి, సునీల్, పోలీసు అధికారులు, పోలీస్ సిబ్బంది, మాజీ సైనికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఆరోగ్యాంధ్ర లక్ష్యంగా అడుగులు



**కోటబొమ్మాళి, జూన్ 26(వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యనిచ్చి ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి కింద నియోజక వర్గంలోని 48 మంది లబ్ధిదారులకు రూ.38,71,000 ల నగదు చెక్కులను శుక్రవారం మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని గత ప్రభుత్వం పేదల ఆరోగ్యం విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, వారి అభ్యున్నతికి, సంక్షేమం ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తున్నారన్నారు. పేదలకు వైద్య పరంగా అత్యవసర సేవలు అందించేందుకు, ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ఎంత మొత్తంలో ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పేద ప్రజల వైద్యం కోసం అందిస్తున్న నిధులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హత ఆధారంగానే సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నట్లు వివరించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల కుటుంబాల్లో ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కి 487 మంది దరఖాస్తులు చేసుకోగా 389 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ ఆఫ్ చెక్కులు మంజూరయ్యాయని, రూ.3,76,40,307 నగదును చెక్కులు రూపేనా పంపిణీ చేసినట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎమ్.కృష్ణ మూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.







# మాదక ద్రవ్యరహిత జిల్లాగా..

# తీర్చిదిద్దుదాం

✲ గంజాయి అక్రమ రవాణాకు ప్రత్యేక నిఘా ✲ మాదకదవ్ర్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలి ✲ గంజాయి రవాణా, వినియోగం, విక్రయంపై ఈగల్ 1972 టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయండి ✲ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ✲ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ✲ నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీ, మానవహారం




శ్రీకాకుళం, జూన్ 26 (వార్త): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నషా ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి డే అండ్ నైట్ జంక్షన్ వరకు నిర్వహించిన ఈ అవగాహన ర్యాలీని శ్రీకాకుళం పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ఎక్సైజ్ శాఖ అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. అనంతరం డే అండ్ నైట్ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీహెచ్ వివేకానంద మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం - మాదకద్రవ్యాల రహిత జిల్లా లక్ష్య సాధన కోసం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గంజాయి, మత్తు మాత్రలు, ఇతర మాదక పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలు, విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ రెడ్డి, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన "సంకల్పం - అభ్యుదయ సైకిల్ యాత్ర" రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన పొందిందన్నారు. పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ యాత్రలో సుమారు 50 వేల మందికి పైగా ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటానికి తమ మద్దతు తెలియజేశారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజలు, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్-1972 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు మరింత పటిష్టమైన చర్యలు చేపడుతూ, అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని డీఎస్పీ వెల్లడించారు.







Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546